

యోగాతో మానసిక ప్రశాంతత

పెగడపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): యోగాతో మానసిక ప్రశాంతత కలుగుతుందని యోగా గురువు కముటం గంగారాం పేర్కొన్నారు. నిత్య జీవితంలో యోగాను దినచర్యగా చేసుకోవాలని ఆయన సూచించారు. పెగడపల్లి మండల కేంద్రంలోని రెడ్డి కల్యాణ మండపంలో శ్రీ వేద యోగ శిక్షణ కేంద్రం ఆద్వర్యంలో బుధవారం యోగా శిక్షణా తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా గంగారాం మాట్లాడుతూ యోగాతో ఆరోగ్య సమస్యలు దూరమవుతాయన్నారు. ప్రతీ ఒక్కరు యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పలు రకాల ఆసనాలు చేయించారు. కార్యక్రమంలో యోగా ట్రైనర్లు చింతకింది కిషోర్, జుంజురు రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

పూజా సామాగ్రి అమ్మకానికి వేలం

వెల్గటూర్, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటిలింగాల శ్రీ కోటేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం బహిరంగ వేలం నిర్వహించినట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి కాంతారెడ్డి తెలిపారు. ఆలయ ప్రాంగణంలో పూజా సామాగ్రి, కొబ్బరికాయలు అమ్ముకోడానికి కోటిలింగాలకు చెందిన రాపాక కొమురయ్య రూ.8,95,000కు, కొబ్బరి ముక్కలు ప్రోగు చేసుకొనే హక్కుకు రూ.70వేలకు వేలం దక్కించుకున్నారు. లడ్డు పులిహోర ప్రసాదము అమ్మడానికి ఆలయ అర్చకుడు సంజీవ్ రూ.2,80,000కు దక్కించుకున్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

కొడిమ్యాల, మే 28 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల తహసీల్దార్‌గా మండలోజు కిరణ్ కుమార్ బుధవారం కొడిమ్యాల తహసీల్దార్‌గా బాధ్యతలను స్వీకరించారు. కొడిమ్యాలలో తహసీల్దార్ జి.రమేష్ మల్లాపూర్‌కు బదిలీపై వెళ్లారు.



జగిత్యాలలో చెత్త తరలించే మున్సిపల్ వాహనాలు

బల్దియాలో డీజిల్ గోల్‌మాల్

- రూ.లక్షల నిధులు పక్కదారి
- వాహన నంబర్లు లేని బిల్లులతో అక్రమాలు
- జగిత్యాల శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు మెమో జారీ

జగిత్యాల, మే 28 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మున్సిపల్ వాహనాల్లో డీజిల్ వినియోగంలో గోల్ మాల్ జరిగింది. గతంలో ఆస్తి పన్ను వసూళ్లు, శానిటేషన్‌లో లక్ష్యాలను అధిగమించి ప్రశంసలు అందుకున్న జగిత్యాల మున్సిపాలిటీలో ప్రస్తుతం అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జగిత్యాల మున్సిపాలిటీలో ప్రతివారం శానిటేషన్ కోసం వాహనాలకు డీజిల్ పోయిస్తున్నారు. బల్దియాలో మొత్తం 72శానిటేషన్‌కు వినియోగించే వాహనాలు ఉన్నాయి. వీటికి వారానికి సుమారు 2వేల లీటర్ల డీజిల్ వినియోగం అవుతుందని అంచనా ఉంది. 2023-24ఆర్థిక సంవత్సరం మార్చి వరకు రూ.10లక్షల డీజిల్ వినియోగం కాగా 2024-25 ఆర్థిక సంవత్సరం మార్చి నెల వరకు రూ.16.27 లక్షలకు పెరగడం అనుమానాలకు తావిస్తోంది. ఏడాదికాలంలో డీజిల్ వినియోగం రూ.6లక్షలకు పైగా పెరగడం ఇందుకు నిదర్శనంగా నిలు స్తోంది. ఈ విషయమై కొందరు కలెక్టర్ సత్యప్రసాద్‌కు ఫిర్యాదు చేయగా ఆయన ఈ వ్యవహారంపై విచారణకు ఆదేశించారు. కలెక్టర్ ఆదేశించి పదిరోజులు గడిచినా నేటికీ విచారణ నివేదిక బయటకు రాకపోవడం గమనార్హం. డీజిల్ వ్యవహారంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు మెమో జారీ చేశారు.

● కూపన్ విధానానికి ఎసరు..

గతంలో వాహనాల్లో డీజిల్ పోయించేందుకు ఎలాంటి అవకతవక లకు తావు లేకుండా అప్పటి పాలకులు కూపన్ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. పారిశుధ్య వాహనంలో వారానికి ఒకసారి సుమారు 30 లీటర్ల డీజిల్ పోయిస్తుండేవారు. కమిషనర్ కూపన్ రాసి ఇస్తే, వాహనదారులు ఆ రశీదులను శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు ఇవ్వాల్సి ఉండేది. శానిటరీ ఇన్స్‌పెక్టర్ పర్యవేక్షణలో వాహనాల్లో డీజిల్ పోయించే విధానం ఉండేది. ఈ పద్ధతి ద్వారా ప్రతి ఏడాది సుమారు రూ.8లక్షల నుంచి రూ.10లక్షల వరకు డీజిల్ ఖర్చు వచ్చేది. కానీ కూపన్ వ్యవస్థకు ఎసరు పెట్టడంతో గత ఏడాదిగా రూ.16లక్షల పైచిలుకు బిల్లులు రావడం అను మానాలకు తావిస్తోంది. కాగా మున్సిపల్ కార్యాలయంలోని వేరే విభాగంలో పనిచేస్తున్న ఓ సీనియర్ అసిస్టెంట్‌కు డీజిల్ బిల్లులు అప్పగించారు.

● మాన్యువల్ బిల్లులు సమర్పణ

మున్సిపల్ వాహనాలకు సంబంధించి డీజిల్ పోయించేపుడు సదరు పెట్రోల్ బంకు నిర్వాహకులు కంప్యూటర్ బిల్లులు ఇస్తుంటారు. సదరు బిల్లులో వాహననంబర్, ఎన్నిలీటర్ల డీజిల్, ఎంతధర, ఏ సమయానికి పోయించారనే పూర్తివివరాలు రశీదు లో నిక్షిప్తమై ఉంటాయి. ఆ బిల్లులనే రిజిస్టర్‌లో ఎంట్రీ చేయాల్సి ఉంటుంది. కానీ కంప్యూటర్ బిల్లులు రావడం...

మిగతా 8లో

అధికారులతో డిప్యూటీ సీఎం వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సత్యప్రసాద్, అధికారులు

జగిత్యాల, మే 28 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధవారం హైదరాబాద్ నుంచి జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా నుంచి కలెక్టర్ సత్యప్రసాద్, అదనపు కలెక్టర్ బీఎస్ లతతో పాటు పలు ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. పలు అంశాలపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

'అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు'


ఇందిరమ్మ లబ్ధిదారుకు మంజూరుపత్రం ఇస్తున్న విప్ ఆది శ్రీనివాస్

మేడిపల్లి, మే 28 : ప్రభుత్వం అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేస్తుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. రెండో విడత కింద 397 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ఉత్తర్వులను కలెక్టర్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు నాలుగు దశల్లో రూ.5 లక్షల ఆర్థిక సమాయం అందుతుందని అన్నారు. ఇంటి నిర్మాణానికి ఉచితంగా ఇసుకను రాష్ట్ర ప్రభుత్వమే అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోవాలి

కొడిమ్యాల, మే 28(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద 2025-2026 సంవత్సరంలో పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో ఇస్వరూప రైతులను కోరారు. బుధవారం ఎంపీడీవో విలేకరులతో మాట్లాడుతూ ఆసక్తి గల ఎస్సీ, ఎస్టీ, సన్న, చిన్నకారు రైతులు అర్హులన్నారు. ఐదు ఎకరాలలోపు పట్టాదారులు, ఉపాధి జాబ్‌కార్డు కలిగి, బోరు బావి, బావికి విద్యుత్ కనెక్షన్ ఉన్నవారు అర్హులన్నారు ఎంచుకున్న తోటను పెంచుకోవటానికి, గుంతలు తీయటానికి, మొక్కలు నాటడానికి మూడు సంవత్సరాల వరకు ఉపాధి హామీ పథకం నుంచి అందిస్తారన్నారు.

పశువుల అక్రమ రవాణా నియంత్రణకు చర్యలు

● ఎస్పీ అశోక్ కుమార్


మాట్లాడుతున్న ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల క్రైం, మే 28 (ఆంధ్రజ్యోతి): పశువుల అక్రమ రవాణాను నియంత్రించేందుకు జిల్లాలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ అశోక్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ పోలీస్ అధికారులతో ప్రత్యేకసమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి నిరంతరంగా తనిఖీలు నిర్వహించ డం జరుగుతుందన్నారు. ఈ చెక్‌పోస్టులు 24గంటలు నిరంతర నిఘా వ్యవస్థలో ఉంటాయని తెలిపారు. పోలీస్, పశుసంవర్ధక శాఖల అధికారులు, సిబ్బంది షిఫ్టుల వారీగా సమన్వయంతో పనిచేస్తారని ఆయన పేర్కొన్నారు. పశువుల రవాణానిబంధనల ప్రకారం జరగాలన్నారు. అనుమతి పత్రాలు లేకుండా ఆవులు, దూడలను రవాణాచేస్తే చట్టపరమైన చర్యలు తీసు కుంటామని ఎస్పీ హెచ్చరించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

రాయికల్, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోర్నపెల్లిలో రాగుల రచనకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కొడిపెల్లి ఆంజనేయులు, గ్రామ శాఖ అధ్యక్షుడు ఉప్పు లక్ష్మణ్, రాగుల సత్యం, నరేష్ పాల్గొన్నారు.

బోర్నపెల్లిలో చెక్‌పోస్టు ఏర్పాటు

రాయికల్, మే 28 (ఆంధ్రజ్యోతి): పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు మండలంలోని బోర్నపెల్లి గ్రామంలో బుధవారం జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు ఎస్సై సుధీర్ రావు చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. పశు వైద్యాధికారుల పర్యవేక్షణలో 24 గంటలు పోలీసుల నిఘాలో చెక్‌పోస్టును ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

'తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తాం'

బీర్‌పూర్,మే 28(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాల కారణంగా కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. బుధవారం బీర్‌పూర్ మండలంలో పర్యటించిన ఆయన కందెనకుంట, చెర్లపెల్లి, నర్సింహులపల్లి గ్రామాలలోని ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులను అన్ని విదాలుగా ఆదుకుంటామని పేర్కోన్నారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాల రాంచందర్ రావ్, నారపాక రమేష్, శఖూలం రమేష్, సుశీన్, నరేందర్, రామచంద్రం గౌడ్, ఆడెపు రవి, హరీష్, తదితరులు పాల్గొన్నారు.


తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

గిరిజనుల అభివృద్ధికి కృషి

రాయికల్, మే 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. మండలంలోని ఒడ్డెలింగాపూర్ గ్రామంలో గిరిజన సంక్షేమ మినీ గురుకులం పాఠశాలలో రూ.40 లక్షల నిధులతో అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాయికల్ మండలం బోర్నపెల్లి-జగన్నాథ్‌పూర్ వంతెనన ఇక్కడి ప్రజల చిరకాల కోరిక అని, ఆర్టికల్ 275 కింద కేంద్రానికి ప్రతిపాదనలు కూడా పంపించామన్నారు. అనంతరం మినీ గురుకులంను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయాలని గ్రామ నాయకులు ఎమ్మెల్యేకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చిరంజీవి, తహసీల్దార్ గణేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

మల్లాపూర్, మే, 28 (ఆంధ్రజ్యోతి) : మల్లాపూర్ మండల కేంద్రంలోని దుర్గమ్మ కాలనీలో ఎస్సీ సబ్ ప్లాన్ కింద మంజూరైన రూ.5లక్షలు నిధులతో నిర్మిస్తున్న అభివృద్ధి పనులను మాజీ జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. బుధవారం గ్రామంలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులు స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ సహకారంతో ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేస్తున్నరన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు లింగస్వామిగౌడ్, శరత్‌గౌడ్, కోడూరి బిక్షపతి, పెద్దిరెడ్డి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరుపై సంబరాలు

కథలాపూర్, మే 28 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ నియోజకవర్గానికి యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు కావడం పట్ల కథలాపూర్‌లో కాంగ్రెస్ నాయకులు బుధవారం సంబరాలు జరుపుకున్నారు. ప్రభుత్వం నియోజకవర్గాని ఒకటి చొప్పున ఒక్కో గురుకులానికి రూ.200 కోట్లు కేటాయించాలని నిర్ణయించగా వేములవాడకు ఆ అవకాశం రావడం సంతోషకరమని పేర్కొన్నారు. నిరుపేద విద్యార్థులకు ఎంతో మేలు చేకూరనుందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రవాణాశాఖా మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి తొట్ల అంజయ్య, మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంబటి రాధాకృష్ణ, లింగారావు, పులి హరిప్రసాద్, అల్లకొండ లింగంగౌడ్, ఎగ్యారపు శ్రీహరి, తలారి మోహన్, పంజాల సత్యనారాయణ, కల్లెడ గంగాధర్, న్యావనంది శేఖర్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు సరైన మార్గదర్శనం చేయాలి

● జగిత్యాల డీఎస్పీ రఘుచందర్


మాట్లాడుతున్న డీఎస్పీ రఘుచందర్

జగిత్యాల అగ్రికల్చర్, మే 28(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాల బారిన పడకుండా విద్యార్థులకు సరైన మార్గదర్శనం చేయాలని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ అన్నారు. భౌతిక, రసాయనశాస్త్ర ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమంలో భాగంగా రెండవ రోజైన బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ రఘుచందర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులుగా మీరు విద్యార్థులను చెడు అలవాట్లకు, చెడు స్నేహాలకు దూరంగా ఉంచాలని సూచించారు. పోక్సో చట్టం, సైబర్ నేరాల రకాల గురించి ఉపాధ్యాయులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డీఈవో రాము, రిసోర్స్ పర్సన్‌లు శ్రీనివాస్‌రావు, చంద్రశేఖర్, రాజ్‌కుమార్, జగదీశ్వర్, కృష్ణసాయితో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు వచ్చేశాయ్... 7

- మండల పాయింట్లకు సరఫరా షురూ
- జూన్12లోగా పాఠశాలలకు పంపిణీ

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా చేపట్టాలి

- కలెక్టర్ సత్యప్రసాద్ 8

నకిలీ విత్తనాలను అమ్మితే కఠిన చర్యలు 8

- డీఏవో భాస్కర్

ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్స్/ రిజిస్టర్ సేల్ డీడ్ పోయినవి

కచ్చు మమత భర్త : రాజ్‌కుమార్ ఇ.నెం. 7-2-172, పోచమ్మవాడ, జగిత్యాల ప్రాపర్ & మండలం, జగిత్యాల జిల్లా (టి.జి) గారికి సంబంధించిన నెంబర్ 4557/1996, మరియు 687/2015 గల ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ / రిజిస్టర్ సేల్ డీడ్ జగిత్యాల ఇంటి నుండి కొత్త బస్టాండ్ మార్గమధ్యలో ఎక్కడో పడిపోయినవి దొరికినవారు సంప్రదించండి. సెల్ : 7675022545, 7177086884

స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి

● బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ


సమావేశంలో పాల్గొన్న బీసీ సంఘం నాయకులు

జగిత్యాల అర్బన్, మే 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని లేని యెడల ఆమరణ నిరాహార దీక్ష చేపడుతామని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో బీసీ సంఘం ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ జీవో జారీ చేసి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ విషయాన్ని కేంద్రంపై నెట్టి దాటవేసే ప్రయత్నం చేస్తున్నదని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్ జీవోను ప్రభుత్వం జారీ చేయని యెడల వెయ్యి మంది బీసీ నాయకులతో ఆమరణ దీక్ష చేపడుతామని హెచ్చరించారు. తెలంగాణ ముఖ్యమంత్రి న్యాయ నిపుణులు, బీసీ సంఘాలతో చర్చించి రిజర్వేషన్ అమలు ప్రక్రియపై ముందుకు వెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు భగవాన్ యాదవ్, కొక్కు గంగాధర్, తిరుపురం రాంచంద్రం, రాచకొండ రోజా, బొమ్మిడి నరేష్, అనుమల్ల సంజయ్ సామ్రాట్, దండుగుల వంశీ, బండపెల్లి మల్లీశ్వరి, హృషికేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

WANTED

★ గ్లోబల్ కంపెనీలో పనిచేయుటకు 10వ తరగతి చదివిన స్త్రీ, పురుషులు 6 గురు కావలెను. వయస్సు 30 లోపువారు ఉచిత వసతి, జీతం: 15,000/- సం॥ప్ర॥ 8247423557.
AJW-237190

పాస్‌పోర్ట్ పోయినది

★ గుండ్ర కిషన్ రావ్ తండ్రి : వెంకట్ రావ్ ఇ.నెం. 1-4-110/1, అరవింద నగర్, మం & ప్రాపర్ & జిల్లా : జగిత్యాల (టి.జి) గారికి సంబంధించిన నెం.K614611 గల పాస్‌పోర్ట్ బైక్ పైన కొత్త బస్టాండ్ నుండి జగిత్యాల పాత బస్టాండ్‌కు వెళ్తుండగా ఎక్కడో పడిపోయినది దొరికినవారు ఇవ్వగలరు. సెల్ : 99891 11504
AJK-238115

PASSPORT MISSING

★ GANDHI MAHESH S/O. GANDHI MALLESHAM H.NO. 8-3-80, BHAGATHNAGAR, KARIMNAGAR, MY ORIGINAL PASSPORT NO : B3793515, MISSING DATE : 28.05.2025 AT BHAGATHNAGAR TO COLLECTORATE ROAD, CONT : 79957 47514
AJK-238160

CHANGE OF NAME

★ I, KATKOJWALA SAI TEJA, S/O. KATKOJWALA SADANANDAM, R/O. H.NO.8-1-84/7/A, GANDHI CHOWK, JAMMIKUNTA, KARIMNAGAR. HAVE CHANGED MY NAME AS "KATUKOJWALA SAITEJA" S/O. KATUKOJWALA SADANANDAM.
AJK-16835

2BHK ఫ్లాట్ అమ్మబడును

★ కరీంనగర్ టవర్ సర్కిల్ - రాజీవ్ చౌక్ దగ్గర 150 మీటర్ల దూరంలో 20 సం॥ క్రితం కట్టిన 1200 SQFT 2BHK అపార్ట్‌మెంట్ అమ్మబడును. ధర 32 లక్షలు. సింగిల్ పేమెంట్ వారికి స్పెషల్ రేట్, ప్రజెంట్ రెంట్ రూ॥ 7,000/- వస్తుంది. సెల్ : 9059549808, 9440639666
AJK-16836

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా / ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.

పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

3+2 స్కీం కలదు

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి
కరీంనగర్ :- సెల్: 9703618691, 9985410640
జగిత్యాల, మెట్‌పల్లి :- సెల్ : 99854 11262
వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 99854 11063
పెద్దపల్లి :- 95509 00238



గుండెపోటుతో లారీ క్లీనర్ మృతి

కరీంనగర్ క్రైం, మే 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అంబడిపూడి ఏడుకొండలు(50) అనే లారీ క్లీనర్ మంగళవారం గుండెపోటుతో మృతిచెందాడు. కరీంనగర్ త్రీటౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడుజిల్లా బల్లపర్ల మండలం వెల్లటూరుకు చెందిన ఏడుకొండలు కొంతకాలంగా లారీక్లీనర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 26న లారీలో వినుకొండ నుంచి కర్రలోడ్ కోసం మహారాష్ట్రలోని చంద్రాపూర్‌కు వెళ్లాడు. చంద్రాపూర్‌లో కర్ర లోడ్‌తో తిరిగి వస్తుండగా మంగళవారం మధ్యాహ్నం కరీంనగర్ హౌసింగ్‌బోర్డు కాలనీ వద్ద ఛాతిలో నొప్పివస్తున్నదని చెప్పిన ఏడుకొండలు లారీలోనే కుప్పకూలాడు. లారీ డ్రైవర్ వెంటనే ఏడుకొండలును 108లో కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు వెల్లడించారు. ఏడుకొండలు కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

జగిత్యాలరూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్థి గ్రామానికి చెందిన బందెల పవిత్ర (31) అనే వివాహిత చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మమత కొన్ని రోజులుగా అనారోగ్యతో బాధపడుతోంది. ఈ క్రమంలోనే ఈనెల 23న ఇంటి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. చికిత్స నిమిత్తం బంధువులు జగిత్యాల లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో బుధవారం తెల్లవారుజామున మృతిచెందింది. మృతురాలి భర్త రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

అప్పుల బాధతో ఆత్మహత్యాయత్నం

● చికిత్స పొందుతూ మృతి

రాయికల్, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన సిరిపురం శ్రీహరి (47) అనే వ్యక్తి అప్పుల బాధ భరించలేక మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో బెడ్‌రూంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. చుట్టుపక్కల వారు గమనించి జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా బుధవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య సిరిపురం అంజలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధీర్ రావు తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు



సమ్మయ్య(ఫైల్)

ముత్తారం, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన కోట సమ్మయ్య అనే వ్యక్తి అదృశ్యం కాగా ఆయన కుమారుడు కోటా అజయ్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశాడని ఎస్సై భూపతి నరేష్ తెలిపారు. ఈనెల 26న ఇంట్లో భార్యాభర్తలకు గొడవ జరగగా గౌడవృత్తి చేసుకునే సమ్మయ్య తాటి చెట్టు ఎక్కివస్తానని సామాను తీసు కొని వెళ్లి తిరిగి ఇంటికి రాలేదన్నారు. రెండు రోజులుగా వెతుకగా మంథని బస్టాండ్‌లో భూపాలపల్లి వైపువెళ్లే బస్సు ఎక్కుతున్నట్లు సమా చారం అందిందని బాధితుడి కుమారుడు అజయ్ ఫిర్యాదులో పేర్కొ న్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

సారంగాపూర్, మే, 28 (ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు సారంగాపూర్ ఎస్సై దత్తాద్రి తెలిపారు. జగిత్యాల మండలం తారకరామ్ నగర్‌కు చెందిన షేక్ రఫీక్(25) అనే వ్యక్తి ఆదిలాబాద్ జిల్లా కంబూడ గ్రామానికి చెందిన మార్వతి కాక వద్ద 1035 గ్రాముల గంజాయిని కొనుగోలు చేశాడన్నారు. అనంతరం జగిత్యాల తరలిస్తుండగా సారంగాపూర్ మండలం పోతారం చౌరస్థ వద్ద పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి గంజాయి, ద్విచక్రవాహనం, ఫోన్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై దత్తాద్రి పేర్కొన్నారు.

ఊడిన చిల్డ్రన్స్ అవేర్‌నెస్ పార్క్ గేటు



తిమ్మాపూర్‌లోని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఊడిన చిల్డ్రన్స్ అవేర్‌నెస్ పార్క్ గేటు

తిమ్మాపూర్, మే 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా రవాణాశాఖ కార్యాలయంలోని రోడ్డు సెఫ్టీ చిల్డ్రన్ అవేర్‌నెస్ పార్క్ గేటు ఈ మధ్యలో వచ్చిన గాలి దూమారానికి ఊడిపోయింది. దాన్ని తిరిగి బిగిం చేందుకు అధికారులు అలసత్వం వహిస్తున్నారని కార్యాలయానికి వచ్చే వాహనచోదకులు ఆరోపిస్తున్నారు. వెంటనే అధికారులు గేటును నాణ్యత ప్రమాణాలతో ఏర్పాటు చేయాలని పేర్కొంటున్నారు.

ఎన్‌ఎఫ్‌బీఎస్ వితంతువులకు భరోసా

కుటుంబ పెద్ద మరణిస్తే రూ.20వేల ఆర్థిక సహాయం



చొప్పదండి, మే 28 (ఆంధ్రజ్యోతి): కుటుంబ పెద్ద మరణిస్తే 20వేల రూపాయల ఆర్థిక సహాయం అందించేందుకు ఉద్దేశించిన ఎన్ ఎఫ్‌బీఎస్ పథకం మళ్లీ ప్రారంభమయింది. ప్రమాదవశాత్తు లేదా ఏదైనా అనారోగ్య కారణాలతో ఇంటి పెద్ద మరణిస్తే 20వేల రూపాయల ఆర్థిక సహాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం పదేళ్ల క్రితం జాతీయకుటుంబ ప్రయోజన పథకం (ఎన్‌ఎఫ్‌బీఎస్)ను ప్రవేశపెట్టింది. వితంతువులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు రూపొందించిన ఈ పథకం కోవిడ్ సంక్షోభ సమయంలో నిలిచిపోయింది.

ఇటీవల ఈ పథకం తిరిగి ప్రారంభం కాగా అర్హుల నుంచి రెవెన్యూ, ఐకేపీ కార్యాలయాల్లో దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న వితంతువుల జాబితాను విచారణ జరిపి అర్హులను ఎంపిక చేసేందుకు అధికారులు కసరత్తును ప్రారంభించారు. కాగా అర్హులు దారిద్ర్యరేఖకు దిగువ కుటుంబానికి చెంది ఉండాలి. కుటుంబ పెద్ద మరణించిన రెండేళ్లలోపు వారు అర్హులు. వితంతువులు తమ దరఖాస్తులను తహసీల్దార్ కార్యాలయాల్లో సమర్పించాలి.

దరఖాస్తుతో వితంతువు ఆధార్ కార్డు, కుటుంబ సభ్యులు ఆధార్ కార్డు, భర్త మరణ ధ్రువీకరణ పత్రం, రేషన్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు ఫొటో, ఐకేపీ అధికారి నుంచి ఎన్‌వోసీ, ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్‌ను జతచేసి దరఖాస్తును అందజేయాలి. 59ఏళ్లకు పైబడిన వితంతువులు ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలు, దళితబంధు, రైతుబీమా, గీత కార్మిక నష్టపరిహారం అందుకున్న కుటుంబాలు, బాధిత కుటుంబాల పథకం నుంచి లబ్ధిపొందిన కుటుంబాలు ఈ పథకానికి అనర్హులు.

ఎన్‌ఎస్‌యూఐ మండలాధ్యక్షుడిపై దాడి

ఇల్లందకుంట, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం కాంగ్రెస్‌లోని రెండు వర్గాల మధ్య గొడవ పరస్పర దాడికి దారి తీసింది. పోలీసులు, ఎన్‌ఎస్‌యూఐ మండలాధ్యక్షుడు అన్వేష్ తెలిపిన వివరాల ప్రకారం.. రెండు మూడ్రోజులుగా హుజూరాబాద్ లీడర్స్ వాట్సాప్‌గ్రూప్‌లో ఇల్లందకుంట ఎన్‌ఎస్‌యూఐ మండలాధ్యక్షుడు అన్వేష్ ఇదే మండలానికి చెందిన సామల రాజిరెడ్డి పరస్పరం చాటింగ్ చేసుకున్నారు. కాంగ్రెస్‌పార్టీలో మేము సీనియర్స్ అంటూ.. మేము లేకుంటే కాంగ్రెస్‌పార్టీ లేదంటూ చాటింగ్ చేసుకున్నారు. ఇద్దరిది ఇల్లందకుంట మండలం కావడంతో బుధవారం చూసుకుందామని సాయంత్రం రాజిరెడ్డి అన్వేష్‌కు ఫోన్‌చేయగా అక్కడికి చేరుకున్న అన్వేష్‌పై రాజిరెడ్డితో పాటు మరోఇద్దరు దాడిచేశారు. దీంతో అన్వేష్‌కు గాయాలు కాగా జమ్మికుంట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. పోలీసులను వివరణ కోరగా ఇద్దరు ఫిర్యాదు చేశారని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ట్రైనీ ఎస్‌ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

భక్తులపై తేనెటీగల దాడి

మల్లాపూర్, మే, 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపల్లివెంకట్రావ్‌పేట శివారులోని లింగాలరేవు వద్దకు బుధవారం మొక్కులు తీర్చుకొనేందుకు వచ్చిన పలువురు భక్తులపై తేనెటీగలు దాడి చేశాయి. భక్తులు మొక్కులు తీర్చుకోవడానికి ప్రతి బుధవారం, శుక్రవారం అధికసంఖ్యలో వస్తుంటారు. బుధవారంభక్తులు మొక్కులు చెల్లిస్తుండగా తేనెటీగలు దాడి చేయడంతో పలువురికిస్వల్ప గాయాలయ్యాయి.

గోదావరిఖనిలో క్షుద్రపూజల కలకలం

కోల్‌సిటీ, మే 28 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిబీకాలనీ రాజీవ్‌రహదారి సర్వీస్ రోడ్డు పైగల మైసమ్మగుడి వద్ద గుర్తుతెలియని వ్యక్తులు క్షుద్రపూజలు చేశారనే ప్రచారంపై స్థానికులు ఆందోళనకు గురయ్యారు. బుధవారం ఉదయం స్థానికులు దీనిని గమనించారు. ఇద్దరి ఫొటోలతో నిమ్మకాయలు, జీడిగింజలు, ఇతర సామగ్రి పెట్టి క్షుద్ర పూజలు చేసినట్టు ఆనవాళ్లు ఉన్నాయి. సమీపంలోని సీసీకెమెరాలను పరిశీలించగా ఒకవ్యక్తి బైక్‌పై వచ్చి అక్కడపెట్టినట్టు గుర్తించారు. బైక్‌నెంబర్ ఆధారంగా మంచిర్యాలజిల్లాకు చెందిన అతడిగా గుర్తించారు.

కళ్లలో కనపడుతున్నావు పెద్దనాన్న..

● నువ్వు వస్తావని ఎదురు చూస్తున్నా

● మావోయిస్టు నేత తిరుపతి తమ్ముడి కూతురు బహిరంగ లేఖ



తిరుపతి(ఫైల్)

కోరుట్ల, మే 28 (ఆంధ్రజ్యోతి): "కళ్లలో కనపడుతున్నావు పెద్దనాన్న... ఇంకా నువ్వు వస్తావని ఇంటి గుమ్మం వద్ద కుటుంబసభ్యులం ఎదురు చూస్తున్నాం... ఎక్కడ ఉన్నా లొంగిపోవాలి.. నువ్వు క్షేమంగా ఉండాలని కోరుకుంటున్నా.." అంటూ మావోయిస్టు అగ్రనేత తిప్పిరి తిరుపతి తమ్ముడి కూతురు సుమ బహిరంగ లేఖ విడుదల చేసింది. ఆపరేషన్ కగార్‌తో వస్తున్న వార్తలను చూసి నీ కోసం కుటుంబం అంతా ఆందోళన చెందుతోందని లేఖలో పేర్కొంది.

కోరుట్ల పట్టణానికి చెందిన తిపిరి గంగమ్మ- వెంకటనర్సయ్య దంపతులకు ఒక కూతురు లీల, ముగ్గురు కుమారులు వెంకటి, తిరుపతి, గంగాధర్ ఉన్నారు. వీరిలో తిరుపతి 18 ఏళ్ల వయసులోనే 1984లో నక్సలిజం వైపు ఆకర్షితుడై అజ్ఞాతంలోకి వెళ్లాడు. అప్పటినుంచి మావోయిస్టు అగ్రనేతగా ఎదిగి అజ్ఞాతంలో ఉంటున్నాడు. అతని అన్న వెంకటి ప్రమాదవశాత్తు మృతిచెందగా తమ్ముడు తిప్పిరి గంగాధర్ కోరుట్లలో నివాసం ఉంటున్నాడు. గంగాధర్ కూతురు సుమ పెదనాన్న కోసం లేఖ రాసింది. నిన్ను చూడాలని ఉందని, ఉద్యమం వదిలి ఇంటికి రావాలని లేఖలో మావోయిస్టు నేత తిరుపతిని సుమ కోరింది.

ఆటో చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



దొంగను అరెస్టు చూపిస్తున్న పోలీసులు

జగిత్యాల క్రైం, మే 28 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాకేంద్రంలోని కోర్టు ఆవరణలో నిలిపి ఉన్న ఆటోను దొంగతనం చేసిన జిలకర ప్రసాద్‌ను అనేవ్యక్తిని జగిత్యాలటౌన్ పోలీసులు బుధవారం అరెస్టుచేశారు. టౌన్‌సీఐ వేణుగోపాల్ బుధవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాలప్రకారం నిర్మల్‌జిల్లా దుస్తురాబాద్ మండలం బుట్టాపూర్ గ్రామానికిచెందిన మగ్గిడి కృష్ణ అనే వ్యక్తి ఈనెల 26న జగిత్యాల జిల్లా కేంద్రంలోని కోర్టుఆవరణలో తనఆటోను పార్కింగ్ చేశాడు. కోర్టు సమీపంలో తన పనులు ముగించుకుని తిరిగి వచ్చేసరికి ఆటో కనబడకపోవడంతో పట్టణపోలీసులకు ఫిర్యాదు చేశాడు. బుధవారం ఉదయంజిల్లా కేంద్రంలోని గాంధీనగర్ పాంత్రంలో పట్టణ పోలీసులు వాహనాలు తనిఖీచేస్తున్న సమయంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గౌతమినగర్‌కు చెందిన జిలకర ప్రసాద్ ఆటోను అతివేగంగా నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. విచారణలో జిలకర ప్రసాద్‌ను ఆటో దొంగగా గుర్తించి అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వేణుగోపాల్ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సై గీత తదితరులు ఉన్నారు.

పుస్తెల తాడు చోరీ

సుల్తానాబాద్, మే 28 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపక్కన మామిడి పండ్లు అమ్ముకుంటున్న మహిళవద్దకు వచ్చిన ఇద్దరు అగంతకులు ఒకరు పండ్లు బేరమాడు తుండగా మరోవ్యక్తి మహిళ మెడలోని పుస్తెల తాడును లాక్కొని పారిపోయిన ఘటన బుధవారం వెలుగుచూసింది. మండలంలోని నీరుకుళ్ల గ్రామానికిచెందిన రమ్య నీరుకుళ్ళ శివారులోని మామిడితోటవద్ద మామిడిపండ్లు విక్రయిస్తోంది. బుధవారం ఇద్దరు బైక్‌పైవచ్చి ఒకరేమో పండ్లు బేరమాడుతుండగా మరొకరు అదునుచూసి మహిళమెడలోని పుస్తెల తాడు లాక్కొని బైక్‌పై పారిపోయారు. బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ట్రైనీ ఎస్సైకి నోటీసులు

హుజూరాబాద్, మే 28 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ ట్రైనీ ఎస్‌ఐ భార్గవ్‌పై చర్యలు తీసుకోవాలని జాతీయకమిషన్ నోటీసులు జారీ చేసిందని టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ అట్రాసిటీ రాష్ట్ర ఇన్‌చార్జీ టి సంపత్ అన్నారు. బుధవారం హుజూరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 15రోజుల క్రితం మండలంలో ట్రైనీ ఎస్‌ఐ భార్గవ్ డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తుండగా మహేందర్ అనే వ్యక్తిని రెండుచెవుల కర్ణబేరిలు పగిలిపోయేలా కొట్టాడన్నారు. దీనిపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, రాష్ట్ర జాతీయ ఎస్సీకమిషన్‌కు ఫిర్యాదు చేశామన్నారు. దీనిపై స్పందించిన మానవ హక్కుల కమిషనర్ కరీంనగర్ సీపీ, అడిషనల్ లాఅండ్‌ఆర్డర్‌కు నోటీసులు జారీచేసిందన్నారు. ప్రజలకు పోలీసులపై విశ్వాసం ఉండాలంటే, నిజానిజాలు తెలవాలంటే ఎస్‌ఐ భార్గవ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రవితేజ, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

● బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సుభాష్‌చంద్రబోస్‌నేత

పెద్దపల్లి కల్చరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలని బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సుభాష్‌చంద్రబోస్‌నేత అన్నారు. జిల్లాకేంద్రంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విద్య నాహక్కు. బాలకార్మిక వ్యవస్థను అంతంచేద్దాం అనే నినాదంతో ముందుకు పోవాలని పిలుపునిచ్చారు. దేశం అభివృద్ధి చెందాలంటే నేటిబాలలే భావిభారత పౌరులుగా తయారు కావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బాలకార్మిక వ్యవస్థ రూపుమాపేందుకు ప్రత్యేకమైన చర్యలు చేపట్టాలన్నారు. బాలలకు స్వేచ్ఛగా ఉండే వాతావరణాన్ని కల్పించాలని, ప్రతీ చిన్న విషయంలో పిల్లలను మందలించవద్దన్నారు. బాలలు బడిలో ఉండాలని పనిలో ఉంటే నేరమన్నారు. బాలకార్మికులచే పని చేయించుకుంటే కఠినమైన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. టోల్‌ఫ్రీ నంబర్ 1098కు సమాచారం అందించాలన్నారు. బాలకార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా మనమంతా కృషిచేద్దామని తెలిపారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు తల్లిదండ్రులు ప్రత్యేకమైన దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. భావితరం బాలలప్రగతికోసం పునాదులు వేద్దామన్నారు. బాలకార్మిక చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.

విత్తనాల దుకాణాలను తనిఖీ చేసిన అధికారులు



నుస్తులాపూర్‌లోని మందుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

తిమ్మాపూర్, మే 28 (ఆంధ్రజ్యోతి): నుస్తులాపూర్‌లోని పలు విత్తన, ఎరువు, పురుగు మందుల దుకాణాల్లో తిమ్మాపూర్ సీఐ సదన్ కుమార్, ఎల్‌ఎండీ ఎస్సై వివేక్, ట్రైనీఎస్సై శ్రీకాంత్‌తో కలిసి మండల వ్యవసాయధికారి సురేందర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆధికారులు మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా అధీకృతడీలర్ వద్ద మాత్రమే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలని సూచించారు. రసీదులు తప్పక తీసుకొని పంటకాలం వరకు వాటిని భద్రపరుచుకోవాలని సూచించారు.

పారిశుధ్య కార్మికుడికి పాముకాటు

కోల్‌సిటీ, మే 28 (ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుడు చంద్రగిరి భూమయ్య (55) బుధవారం పాముకాటుకు గురయ్యాడు. గోదావరిఖని గాంధీనగర్‌లోని ప్రధాన నాలాలో పూడిక పేరుకుపోయి చెట్లు పొదలు పెరగడంతో పారిశుధ్య కార్మికుడు చంద్రయ్య వాటిని తొలగించేందుకు డ్రైన్‌లోకి దిగాడు. పారిశుధ్య పనులు నిర్వహిస్తుండగా పాము చేయిపై కాటు వేసింది. అతడిని గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. అతని పరిస్థితి నిలకడగా ఉన్నట్టు వైద్యులు పేర్కొన్నారు.

మృతదేహాలు ఇవ్వకపోవడం రాజ్యాంగ విరుద్ధం

● మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

● పౌర హక్కుల సంఘం ఉమ్మడి జిల్లా కమిటీ డిమాండ్



అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న పౌరహక్కుల సంఘం నేతలు

పెద్దపల్లిటౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టుల మృతదేహాలను కుటుంబ సభ్యులకు ఇవ్వకపోవడం రాజ్యాంగ విరుద్ధమని పౌరహక్కుల సంఘం, ప్రజాఫ్రంట్ నాయకులు పేర్కొన్నారు. ఎన్‌కౌంటర్‌ను నిరసిస్తూ జిల్లాకేంద్రం అంబేద్కర్ విగ్రహం వద్ద పౌరహక్కుల సంఘం ఉమ్మడికరీంనగర్ జిల్లా కమిటీఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. వివిధ ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ ఈనెల21న నారాయణపూర్ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టుల మృతదేహాల అప్పగింతపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆర్డర్ ఇచ్చినప్పటికీ ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం అక్కడిపోలీస్‌వర్గాలు కుటుంబ సభ్యులకు మృతదేహాలనుఇవ్వలేదని, నాలుగు రోజులు ఇబ్బందులకు గురిచేస్తూచివరకు పోలీసులే దహన సంస్కారాలు చేశారన్నారు. కుటుంబ సభ్యులు, ప్రజాసంఘాలు, ప్రజలు, ప్రజాస్వామిక వాదులుమావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు, సహచరుల మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. మావోయిస్టుపార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాలకేశవరావు, సహచర సభ్యుల బూటకపు ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జీచే న్యాయ విచారణ జరపాలని, ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని, మావోయిస్టు పార్టీతో కేంద్రప్రభుత్వం శాంతి చర్చలు జరపాలని డిమాండ్‌చేశారు.

పౌరహక్కుల సంఘం రాష్ట్రసహాయ కార్యదర్శి మాధన కుమార స్వామి, ఉమ్మడి కరీంనగర్‌జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బొంకురిలక్ష్మణ్, బొడ్డుపల్లి రవి, తెలంగాణ ప్రజా ఫ్రంట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుమ్మడి కొమురయ్య, పులిపాక రవీందర్, విప్లవ రచయితల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కన్వీనర్ బాలసాని రాజయ్య, దళిత లిబరేషన్‌ఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్వాడీ సుదర్శన్, అశోక్, మోదుంపల్లి శ్రవణ్, ఆంజనేయ శర్మ, సుచరిత, పర్వతాలు, సత్యనారాయణ, బండి శంకర్ పాల్గొన్నారు.

జనావాసాల మధ్య పేలుళ్లు

● ఆందోళన చెందుతున్న స్థానికులు



ఇళ్లకు సమీపంలో ఓ బావి వద్ద చేపడుతున్న పూడికతీత పనులు

గన్నేరువరం, మే 28 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పనులు ఊపందుకుంటున్న వేళ రైతులు వ్యవసాయబావుల్లో పూడికతీత పనులు మొదలుపెట్టారు. ఈ క్రమంలో మండలకేంద్రంలోని ఎస్సీ, బీసీ, పద్మశాలికాలనీ నుంచి వ్యవసాయక్షేత్రాలకు వెళ్లేమార్గంలో ఉన్న బావుల్లో పూడికతీత పనులు జరుగుతున్నాయి. బావి అడుగున బండరాళ్లు అడ్డురావడంతో పేలుడు పదార్థాలైన జిలిటెన్ స్టిక్స్‌లను వినియోగిస్తున్నారు. వీటివినియోగంపై స్థానికులకు సమాచారం ఇవ్వకపోవడంతో పేలుడు శబ్దాలతో వారంతా భయాందోళనలకు గురవుతున్నారు. బుధవారం పోలీస్ స్టేషన్ సమీపంలోనే పేలుళ్లు జరిగాయి. ఎలాంటి అనుమతులు, సమాచారం లేకుండా పేలుళ్లు జరపడంపై స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పేలుడు పదార్థాలు వినియోగించే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఈ పేలుళ్లు జరగడం గమనార్హం.

హోటల్‌ను సీజ్ చేసిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్



జగిత్యాలలో హోటల్‌ను సీజ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష

జగిత్యాల అర్బన్, మే 28 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని తహసీల్ చౌరస్తా సమీపంలో గల శివసాయి హోటల్‌ను బుధవారం జగిత్యాల ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష సీజ్ చేశారు. హోటల్‌లో టిఫిన్ తిని కొద్దిరోజుల వ్యవధిలోనే ఫుడ్ పాయిజన్ అయి పలువురు అస్వస్థతకు గురయ్యారు. దీంతో బుధవారం జగిత్యాల ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ హోటల్‌లో ఆహార పదార్థాలను పరిశీలించారు. అనంతరం హోటల్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. మేడిపల్లి మండలానికి చెందిన ఓవ్యక్తి తన కుమారుడితో కలిసి ఈ నెల 21న ఇదే హోటల్‌లో టిఫిన్‌చేయగా వాంతులు అయ్యాయి. జగిత్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందినట్లు బాధితుడు తెలిపాడు. ఈ నెల 22న మేడిపల్లి మండలం కాసారం గ్రామానికి చెందిన ఓ గర్భిణి ఇక్కడ టిఫిన్ చేయగా తీవ్ర అస్వస్థతకు గురైనట్లు ఆమెసోదరుడు తెలిపారు. మంగళ వారం బుగ్గారం మండల కేంద్రానికి చెందిన బిసవేని వినోద్ గౌడ్‌తోపాటు అతడి అక్కపిల్లలు, తల్లి తీవ్రఅస్వస్థతకు గురై ఆసుపత్రిలో చేరారు. సంపాదనే ధ్యేయంగా వినియోగదారుల ప్రాణాలను లెక్కచేయ కుండా వ్యాపారాలు చేస్తున్న టిఫిన్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని వినోద్ జిల్లాఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశాడు.

భవనంపై హోర్డింగ్ బిగిస్తుండగా ప్రమాదం

● హెచ్‌టీ లైన్ తగిలి కార్మికుడికి తీవ్రగాయాలు



గాయపడిన తిరుపతి

కోల్‌సిటీ, మే 28 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మార్కండేయకాలనీ జంక్షన్ వద్ద భవనంపై అడ్వర్టయిజ్‌మెంట్ హోర్డింగ్ బిగిస్తుండగా కార్మికుడికి ప్రమాదవశాత్తు 11కేవీ విద్యుత్ వైర్ తగిలింది. ఒక రెస్టారెంట్‌కు సంబంధించి డిజిటల్ బోర్డు బిగించేందుకు సామగ్రి భవనంపైకి ఎక్కిస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో మహబూబాబాద్ జిల్లా గూడూరుకు చెందిన తిరుమల్(53) అనే కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. అతనికి తీవ్ర గాయాలయ్యాయని వైద్యులు పేర్కొన్నారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగానే ఉంది. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు. మూడేళ్ల క్రితం ఇదే విధంగా హై టెన్షన్ లైన్ల కింద ఫ్లెక్సీ బిగిస్తుండగా విద్యుత్‌షాక్ తగిలి ఒక కార్మికుడు మృతి చెందాడు. మళ్లీ ఇదే తరహా ప్రమాదం చోటు చేసుకుంది.

నేడు ఉమ్మడి జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశం...

హాజరుకానున్న ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, మే 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా అభివృద్ధి, సంక్షేమ పథకాలపై గురువారం సమీక్షా సమావేశం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరుగనుంది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన ఈ సమావేశం జరుగనుంది. సమీక్షా సమావేశానికి రాష్ట్ర ఐటీ పరిశ్రమలు, వాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు హర్కార్ వేణుగోపాల్ రావులతోపాటు ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీలు, కలెక్టర్లు, పోలీస్ కమిషనర్, జిల్లా ఎస్పీలు, ఇతర అధికారులు పాల్గొంటారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉదయం 9 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 9.50కి కరీంనగర్ రీజనల్ స్పోర్ట్స్ స్కూల్ మైదానంలోని హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.

ఎస్సారార్ పీజీ సెమిస్టర్ ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కల్వకుంట రామకృష్ణ

గణేశ్‌నగర్, మే 28 (ఆంధ్రజ్యోతి): శ్రీరాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ అటనామస్ కళాశాల పీజీ మొదటి, మూడో సెమిస్టర్ ఫలితాలను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కల్వకుంట రామకృష్ణ, శాతవాహన యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ సురేష్ కుమార్, కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్ బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎస్సారార్ కళాశాలలో 11 పీజీ కోర్సులు నిర్వహిస్తున్నట్లు, వాటి ఫలితాలను విడుదల చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్ మాట్లాడుతూ పీజీ మొదటి సెమిస్టర్‌లో 261 మంది విద్యార్థులకు 226 మంది(87శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. పీజీ మూడో సెమిస్టర్‌లో 242 మందికి 222 (92 శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు, వెబ్‌సైట్లో ఫలితాలను పొందుపరిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కల్వకుంట రామకృష్ణ, శాతవాహన యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ సురేష్, వైస్ ప్రిన్సిపాల్ నితిన్ పాఠక్, టీజీసీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్, అదనపు పరీక్షల నియంత్రణ అధికారులు కరుణాకర్, డాక్టర్ మల్లారెడి, అకాడమిక్ సమన్వయకర్తలు పాల్గొన్నారు.



జగిత్యాల గోదాంలో పంపిణీకి సిద్ధంగా ఉన్న పాఠ్య పుస్తకాలు

వెల్గటూర్ ఎమ్మార్సీలో పుస్తకాలు పంపిణీ చేస్తున్న సిబ్బంది

పాఠ్య పుస్తకాలు వచ్చేశాయ్..

- మండల పాయింట్లకు సరఫరా షురూ
- జూన్ 12లోగా పాఠశాలలకు పంపిణీకి చర్యలు

వెల్గటూర్, మే 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా సరఫరా చేసేందుకు పాఠ్య పుస్తకాలు జిల్లాకు చేరుకున్నాయి. సర్కారు బడులను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా బడులు తెరిచే నాటికి విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కులు, యూనిఫాంలు అందించేలా విద్యా శాఖ కసరత్తు చేస్తోంది. పాఠ్యపుస్తకాలు జిల్లాకు, అక్కడి నుంచి మండల పాయింట్లకు చేరు కుంటు న్నాయి. జూన్ 12న పాఠశాలలు పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో అప్పటి వరకు అన్ని తరగతు లకు సంబంధించిన పుస్తకాలు అందించేలా చర్యలు చేపడుతామని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

విడుదల కాని రవాణా చార్జీలు

జగిత్యాల జిల్లాలో అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 85,368 మంది విద్యార్థులు చదువుతున్నారు. జిల్లాకు 3,80,760 పుస్తకాలు అవసరం కాగా ఇప్పటి వరకు 3,52,000 పుస్తకాలు గోదాంకు చేరుకున్నాయి. ఇంకా 28,760 పుస్తకాలు రావాల్సి ఉంది. గతంలో ఉన్నత తరగతులకు నోట్ బుక్స్ పంపిణీ చేయగా, ప్రభుత్వం ఈసారి ప్రాథమిక తరగతులకు సైతం నోట్ బుక్స్ పంపిణీ చేయాలని నిర్ణయించింది. జిల్లా కేంద్రంలో భద్రపర్చిన పుస్తకాలను ప్రస్తుతం ఆయా మండలాల ఎమ్మార్సీలకు పంపిణీ చేస్తున్నారు. అక్కడి నుంచి ఎమ్మార్సీ సిబ్బంది, సీఆర్పీలు పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ద్వారా స్కూల్ పాయింట్లకు చేరవేస్తున్నారు. కాగా పాఠ్య పుస్తకాల ట్రాన్స్‌పోర్ట్‌కు ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు నిధులు విడుదల కాలేదని అధికారులు చెబుతున్నారు. ఎంఈవోలు ఈ చార్జీలు భరిస్తున్నట్లుగా తెలుస్తోంది. నిధులు వచ్చిన తర్వాత వారికి బిల్లులు అందించనున్నట్లు సమాచారం.

పంపిణీకి సిద్ధంగా బైలింగ్వల్ పార్టు-1 పుస్తకాలు

ప్రస్తుతం పాఠశాలల పునః ప్రారంభం రోజే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసేందుకు విద్యాశాఖ అధికారులు సిద్ధం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఇంగ్లీష్ మీడియంలో చేర్పించాలనే ధోరణి ఏర్పడడంతో ప్రభుత్వం అన్ని పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం అమలు చేస్తోంది. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యపుస్తకాల్లో (బై లింగ్వల్) ఒక పేజీలో తెలుగు, మరొక పేజీలో ఇంగ్లీష్‌లో పాఠాలను ముద్రించారు. ఈ క్రమంలో పాఠ్య పుస్తకాలను పార్టు-1, పార్టు-2 గా విభజించి విద్యార్థులకు అందిస్తున్నారు. ప్రస్తుతం పార్టు-1 పుస్తకాలు జిల్లాకు చేరుకోగా, పార్టు-2 పుస్తకాలు సెప్టెంబర్ వరకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వీటిని విభజించడం ద్వారా విద్యార్థులకు పుస్తకాల బరువు కూడా తగ్గింది.

పాఠ్య పుస్తకాల పంపిణీ ప్రారంభించాం

ద్రోణం రాజు వెంకట రామకృష్ణ, పాఠ్య పుస్తకాల జిల్లా మేనేజర్, జగిత్యాల



జిల్లా గోదాం నుంచి మండల పాయింట్లకు పాఠ్య పుస్తకాల పంపిణీ ప్రారంభించాం. జిల్లాకు 92 శాతం పాఠ్యపుస్తకాలు చేరుకున్నాయి. ఇప్పటికే 16 మండలాలకు పుస్తకాలు పంపిణీ చేశాం. బడిబాట కార్యక్రమానికి ముందుగానే పుస్తకాలు చేరవేసే విధంగా చర్యలు చేపడుతున్నాం.

డిగ్రీ పరీక్షల్లో 34 మంది డీబార్

గణేశ్‌నగర్, మే 28 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ నాలుగు, ఆరో సెమిస్టర్ పరీక్షల్లో బుధవారం మాల్‌ప్రాక్టీస్ చేసిన 34 మంది విద్యార్థులను డీబార్ చేసినట్లు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డి.సురేష్‌కుమార్ తెలిపారు. నాలుగో సెమిస్టర్‌లో తొమ్మిది మంది, ఆరో సెమిస్టర్ 25 మంది డీబార్ అయినట్లు పేర్కొన్నారు.

కరీంనగర్‌లోని వాగేశ్వరి డిగ్రీ కళాశాల కేంద్రంలో 13 మంది, శివాని నలుగురు, అపూర్వలో ఇద్దరు, ఎస్ఆర్ఎం డిగ్రీ కళాశాలలో ఒకరు, జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు, చాణక్య డిగ్రీ కళాశాలలో ఒకరు, హుజూరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నలుగురు, సిరిసిల్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఒకరు, శ్రీ శివానిలో ఒకరు, మెట్‌పల్లి జ్ఞానోదయ డిగ్రీ కళాశాలలో ఒకరు, గోదావరిఖని ప్రభుత్వం డిగ్రీ కళా శాలలో ఒకరు, పెద్దపల్లి ట్రినిటీ డిగ్రీ కళాశాల ఒకరు, ప్రభుత్వం డిగ్రీ కళాశాల ఒకరు, కోరుట్ల ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో ఒకరు, జగిత్యాల ప్రభుత్వ ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో ఒకరు ఉన్నట్లు వివరించారు.

రాజన్న ఆలయం మూసివేత వదంతులు నమ్మొద్దు

వేములవాడ కల్చరల్ మే 28 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయాన్ని జూన్ 15వ తేదీ నుంచి మూసి వేస్తున్న ట్లు ఆలయ ఈవో పేరుతో ఓ తప్పుడు లేఖ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నదని, అలాంటి వదంతులను ప్రజలు నమ్మవద్దని రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాజన్న ఆలయంలో ఆలయాన్ని మూసివేస్తున్నట్టుగా ఎలాంటి లేఖను విడుదల చేయలేదని సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న లేఖకు రాజన్న ఆలయానికి ఎలాంటి సంబంధం లేదని, ఆలయంలో దర్శనాలు యథావిధిగా కొనసాగుతాయని పేర్కొన్నారు.

42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి

గణేశ్‌నగర్, మే 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోందన్నారు. బీసీల రిజర్వేషన్లు 42 శాతానికి పెంచే విషయంలో ప్రభుత్వం ఇంతవరకు క్లారిటీ ఇవ్వలేదన్నారు. ఒక్కోసారి ఒక్కో రకమైన ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఒకసారి 42 శాతం రిజర్వేషన్లు పెంచుతున్నట్లు ప్రకటిస్తున్నారని, మరోసారి పార్టీ పరంగా 42 శాతం టికెట్లు ఇస్తామంటున్నారని అన్నారు. పార్టీ పరంగా ఇస్తే అన్యాయం జరుగుతుందని, రిజర్వేషన్లు పెంచుతూ జీవో జారీ చేయాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న నర్సింగోజు శ్రీనివాస్

12 నెల క్రితం నిర్వహించాల్సిన ఎన్నికలు బీసీ రిజర్వేషన్లతో వాయిదా పడుతున్నాయన్నారు. ప్రస్తుతం బీసీ రిజర్వేషన్ల విషయం పూర్తిగా పరిష్కారం కాలేదన్నారు. పరిష్కారం కాకుండా ఎన్నికలకు వెళ్లడం న్యాయం కాదని, ప్రతిపక్ష పార్టీలు బీసీ రిజర్వేషన్లు విషయంలో తమ వైఖరి ప్రకటించాలని కోరారు. బీసీ రిజ ర్వేషన్లు 20 శాతం నుంచి 42 శాతం అసెంబ్లీలో చట్టం చేశారని, దాని ప్రకారం ఇంత వరకు ప్రభుత్వం జీవో జారీ కాలేదని అన్నారు. రాజ్యాంగం ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని, కేంద్రంపై నెట్టి తప్పించుకోవాలని చూస్తున్నారని అన్నారు. బీసీ యువజన సంఘం జిల్లా కార్యదర్శి లింగం పల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పెద్ది శ్రీనివాస్, బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

అబద్ధాల పునాదులపై మోదీ పాలన

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



సీపీఐ మహాసభల్లో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

భగత్‌నగర్, మే 28(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అబద్ధాల పునాదులపై పాలన సాగిస్తున్నదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో పార్టీ మహాసభల సందర్భంగా ప్రతి నిధుల సమావేశంలో మాట్లాడారు. దేశంలో సమస్యలను గాలికి వదిలేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. స్వాతంత్ర్యం అనంతరం కూడా ఇళ్లు, ఇళ్ల స్థలాలు, ఉద్యోగ, ఉపాధి, తిండి వంటి ఎన్నో కష్టాలను పేదలు అనుభవిస్తున్నార్నారు. దేశంలో ఆదాయం రెట్టింపు అయ్యిందని అబద్ధాలు చెబుతూ దేశాన్ని అప్పుల పాలు చేశారన్నారు. దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు ధారదత్తం చేస్తున్నారన్నారు.

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం బలహీన వర్గాలపై ముప్పేట చేస్తోందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ రుణమాఫీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలు అమలు కావడం లేదన్నారు. అర్హులకు ఇవ్వకుండా ఇష్టారీతిన నిబంధనలు పెట్టడం న్యాయం కాదన్నారు. స్థానిక ఎన్నికల్లో సీపీఐ సత్తా చాటాలన్నారు. అంతకుముందు సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి మూడేళ్లలో జిల్లాలో నిర్వహించిన పార్టీ కార్య క్రమాల వివరాలను కార్యదర్శి నివేదికను సభలో ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, మచ్చ రమేష్, కిన్నెర మల్లవ్వలు, సీపీఐ కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మర్రి వెంకటస్వామి, పొనగంటి కేదారి, బోయిని అశోక్, కొయ్యడ సృజన్‌కుమార్, అందెస్వామి, బత్తుల బాబు, గూడెం లక్ష్మీ పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా కార్యదర్శిగా పంజాల శ్రీనివాస్



సీపీఐ జిల్లా కార్యదర్శిగా పంజాల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. నగరంలో రెండు రోజుల పాటు నిర్వహించిన 123వ మహాసభలు ముగింపు సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్‌లు హాజరయ్యారు. జిల్ల మహా సభలో నూతన కార్యవర్గం, కౌన్సిల్ ఎన్నికలను నిర్వహించారు. 14 మంది కార్యవర్గం ఏర్పాటు కాగా, 35 మందితో కౌన్సిల్, ఐదుగురు క్యాండిడేట్ సభ్యులు, నలుగురు ఆహ్వానితులను ఎన్నుకున్నారు.




విద్యుత్ సమస్యల పరిష్కారానికి వాట్సాప్ చాట్‌బాట్

టీజీ ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ మేక రమేష్‌బాబు

గణేశ్‌నగర్, మే 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులు వాట్సాప్ చాట్‌బాట్ ద్వారా కూడా తమ సమస్యలను తెలుపవచ్చని టీజీ ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ మేక రమేష్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు తమ మొబైల్ నుంచి వాట్సప్‌లో 7901628348 నంబర్‌కు హాయ్ అని చాట్ చేయగానే హాయ్ టీజీ ఎన్‌పీడీసీఎల్ కాల్ సెంటర్‌కు స్వాగతం అని వస్తుందన్నారు. అందులో రిజిస్టర్ కంప్లైంట్, ట్రాక్ కంప్లైంట్, చాట్ విత్ ఏజెంట్ అనే మెసేజ్ వస్తుందన్నారు. రిజిస్టర్ కంప్లయింట్‌పై క్లిక్ చేయగానే విత్ యూనిక్ సర్వీస్ నంబర్, వితవుట్ యూనిక్ సర్వీస్ నంబర్, ప్రీవియస్ మెనూ అని వస్తుందని తెలిపారు.

విత్ యూనిక్ సర్వీస్ నంబర్‌ను సెలక్ట్ చేసి నంబర్‌ను ఎంటర్ చేయగానే సర్వీస్ వివరాలు వస్తాయన్నారు. వివరాలను ఎంటర్ చేసి ఓకే చేయగానే కంప్లయింట్‌కు సంబంధించిన వివరాలు మెనూలో కనపడుతాయని తెలిపారు. అందులో కంప్లయింట్‌కు సంబంధించి సబ్ టైప్ లేదా చాట్ విత్ ఏజెంట్ అని వస్తుంది. తర్వాత ఏజెంట్‌తో చాట్ చేయవచ్చు లేదా కంప్లయింట్ నమోదు చేసుకోవచ్చని తెలిపారు. కంప్లయింట్ ఐడీతో ఒక నంబర్ జెనరేట్ అయ్యి ఫిర్యాదు నమోదవుతుందని తెలిపారు. అనంతరం చర్యల కోసం సంబంధిత అధికారికి కంప్లయింట్ వెళుతుందని, ఈ విషయం వినియోగదారుడి మెసేజ్ వెళ్తుందని తెలిపారు. భవిష్యత్తులో కంప్లయింట్ ఐడీతో వినియోగదారుడి సమస్యను ట్రాక్ చేసుకోవచ్చని తెలిపారు. కంప్లయింట్ పూర్తైన తర్వాత వినియోగదారుడికి సమాచారంతోపాటు ఐవీఆర్ఎస్ ద్వారా కాల్ వెళ్తుందన్నారు.

సమస్య పరిష్కరించిన తర్వాత ఫీడ్ బ్యాక్ ఇవ్వమని అడుగుతుంది లేదా సంతృప్తి చెందకపోతే మళ్లీ కంప్లైంట్ రీఓపెన్ చేయమని అడుగుతుందని తెలిపారు. www.tgnpdcl.com వెబ్‌సైట్‌లో వాట్సాప్ ఐకాన్ కనిపి స్తుందని, ఆ ఐకాన్ క్లిక్ చేసి చాట్ చేయ వచ్చని తెలిపారు. వినియోగదారుడికి ఉత్తమసేవలు అందించడంలో భాగంగా సాంకేతికతను అందిపుచ్చుకుని విద్యుత్ సమస్యలను పరిష్కరించడానికి వాట్సాప్ చాట్‌బాట్ ఎంతో ఉపకరిస్తుందని తెలిపారు. టోల్ ఫ్రీ నంబర్ 1912 సంప్రదించి సేవలు పొందాలని సూచించారు.



అత్యుత్తమ ఫలితాలు సాధించినందుకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డు

తంగళ్లపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ పద్మ దర్శనాల రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. 2024-25 సంవత్సరం పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించి ప్రతిభ చాటారు. అందుకుగాను బుధవారం హైదరాబాదులోని బాబు జగ్జీవన్ రామ్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా సర్టిఫికెట్‌తో పాటు ఐదు లక్షల క్యాష్ అవార్డును కళాశాల ప్రిన్సిపాల్ పద్మ అందుకున్నారు. అలాగే కళాశాలలో ఇంటర్మీడి యట్ ద్వితీయ సంవత్సరంలో స్టేట్ రెండో ర్యాంకు సాధించిన నందినికి రూ10 వేల క్యాష్ అవార్డు అందజేశారు.



తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ పద్మకు అవార్డు అందజేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

సమగ్ర విద్యకు ప్రభుత్వం కృషి

మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ

కరీంనగర్ అర్బన్, మే 28 (ఆంధ్రజ్యోతి): సమగ్ర విద్యాకోసం ప్రభుత్వం కృషి చేస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని సంజీవయ్య సంక్షేమ భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి సీఎం రేంత్‌రెడ్డితో కలిసి హాజరయ్యారు. తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ నిర్వహిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్సీ విద్యార్థుల కోసం తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా విధానాలు అభినందనీయమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 268 ఇంగ్లీష్ మీడియం రెసిడెన్షియల్ విద్యాసంస్థల ద్వారా దాదాపు 1.7 లక్షల మంది విద్యార్థులకు ఉచితంగా విద్యను అందించడం సామాజిక న్యాయ దిశగా ముందడుగన్నారు.



హుండీని లెక్కిస్తున్న సిబ్బంది

రాజన్న ఆలయ 13 రోజుల హుండీ ఆదాయం లెక్కింపు

వేములవాడ కల్చరల్ మే 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి హుండీ లెక్కింపును బుధవారం చేపట్టారు. ఆలయ 13 రోజుల హుండీని ఓపెన్ స్లాబ్‌లో అత్యంత భద్రత మధ్య లెక్కించగా కోటి 44లక్షల 25వేల 31 రూపా యల నగదు, 107 గ్రాముల 500 మిల్లీ గ్రాముల బంగారం, 7 కిలోల 900 గ్రాముల వెండి సమకూరినట్లు ఆలయాధికారులు వెల్లడించారు. కార్యనిర్వహణాధికారి వినోద్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయ పరిశీలకుడు సత్యనారాయణ, ఏఈవోలు ఆలయ సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు. హుండీ కౌంటింగ్‌లో శ్రీశివరామకృష్ణ భజన మండలి వారు పాల్గొన్నారు.

మత్తడి దూకుతున్న చెక్‌డ్యాంలు

హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

కొడిమ్యాల, మే 28 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలంలో అడపాదడపా కురుస్తున్న వర్షాలకు కొడిమ్యాల పెద్ద వాగు పారుతూ పూడూర్ గ్రామ శివారులోని ఐదు చెక్‌డ్యాంలు బుధవారం నుంచి మత్తడి దూకుతున్నాయి. దీంతో సాగు నీటికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని ఈ ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చెక్‌డ్యాంల నీటితో ఈ రోహిణి కార్తీలో పత్తి, మొక్కజొన్న, కంది, పెసళ్లు, పచ్చిరొట్ట విత్తనాలు విత్తుకోవటానికి అనుకూలంగా ఉంటుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. పూడూర్ గ్రామ శివారులో అకాల వర్షం నీటితో నిండిన చెక్‌డ్యాంలను బుధవారం సిరిసిల్లలోని వ్యవసాయ కళాశాల విద్యార్థినులు సందర్శించారు.



మత్తడి దూకుతున్న కొడిమ్యాల పెద్ద వాగు

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

మెట్‌పల్లి రూరల్, మే, 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక రవాణా చేసిన, డంపింగ్ చేసినా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మెట్‌పల్లి తహసీల్దార్ శ్రీనివాస్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని ఆత్మకూర్ గ్రామ శివారులో అక్రమంగా నిల్వ ఉంచిన సుమార్ 100 ట్రిప్పుల ఇసుక డంపులను తహసీల్దార్ సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ శివారులో ఎలాంటి అనుమతి లేకుండా భారీగా ఇసుక డంపులు ఉన్నాయని సమాచారం మేరకు దాడులు నిర్వహించడం జరిగిందన్నారు. ఇసుక డంపులను పరిశీలించి ఎలాంటి అనుమతి లేకపోవడంతో సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. నిబంధనల మేరకే ఇసుక కొనుగోళ్లు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా అక్రమంగా ఇసుక తరలించిన డంపింగ్ చేసిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడులో ఆర్‌ఐ ఉమేష్, సిబ్బంది ఉన్నారు.

నిబంధనలు పాటించేలా చూడాలి

ధర్మపురి, మే 28 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పుణ్యక్షేత్ర పరిధిలో బక్రీద్ సందర్భంగా గోవధ, మిగతా జంతువుల వధ కోసం ఎలాంటి అనుమతులు ఇవ్వరాదని కోరుతూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమీషనర్ కార్యాలయంలో బుధవారం వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో జీవో 2007 ప్రకారం అన్యమత ప్రచారం, గోవధ కఠినంగా నిషేధించబడిందని తెలిపారు.. గోవులను విచ్చల విడిగా వధించి బక్షిసున్నారని, అక్రమ రవాణా, అక్రమ వధను వెంటనే అడ్డుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు అల్లం దుర్గప్రసాద్, కస్తూరి రాజన్న, మ్యాన పూర్ణచందర్, ముత్యపు రమేష్, నలుమాసు వైకుంఠం, ఎలగందుల రవి, కలకోట రాజు, ఆసం సురేష్, తిరుమన్‌దాసు సత్యనారాయణ, చీపురిశెట్టి దేవేందర్, మండలోజు సూరజ్, కాశెట్టి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందిని ఆన్‌లైన్ చేయాలి

కొడిమ్యాల, మే 28(ఆన్‌లైన్) : గ్రామ పంచాయతీలలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని ఆన్‌లైన్ చేయాలని కోరుతూ బుధవారం జిల్లా కేంద్రంలో డీపీవోకు వినతిపత్రం అందించినట్లు జిల్లా యూనియన్ అధ్యక్షుడు కోమటి చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ గ్రామంలో అన్ని రకాల పనులను చేస్తున్న వారందరిని చేయాలని కొంతకాలంగా వినతి పత్రాలను అందించామన్నారు. జిల్లాలోని కొన్ని మండలాలోని సిబ్బందికి పేరుక పోయిన బకాయి వేతనాలను చెల్లించాలని వినతి పత్రంలో కోరారు. ఎంపీడబ్ల్యు వర్కర్స్‌ను ఆన్‌లైన్ చేసి పంచాయతీ సిబ్బందికి అన్ని విధాల సౌకర్యాలను కలిపించాలని ఆయన కోరారు. వినతిపత్రం అందించిన వారిలో న్యాతరి మల్లవ్వ, వివిధ మండలాల అధ్యక్షులు రాజేందర్, రాజు, రాజయ్య, గంగయ్య, సత్తయ్య, హన్మయ్య, స్వామి, మల్లేశం తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా చేపట్టాలి


లబ్ధిదారుకు ఇందిరమ్మ మంజూరు పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే సత్యం, కలెక్టర్ సత్యప్రసాద్

కొడిమ్యాల, మే 28(ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు త్వరగా చేపట్టాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అక్షయ గార్డెన్‌లో చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యంతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. స్వంత భూమి ఉన్న లబ్ధిదారులు గ్రామ పంచాయతీ సెక్రెటరీ యాప్‌లో చూసిన తర్వాతనే నిర్మాణం చేపట్టాలన్నారు. ముందుగా నిర్మాణాలను చేపట్టిన ట్లయితే బిల్లుల చెల్లింపులో ఇబ్బందులు తలెత్తుతాయన్నారు.

చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో అర్హులైన ప్రతి పేద వారికి నీడ కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. మొదటి విడతలో చొప్పదండి నియోజకవర్గానికి 3500 ఇళ్లు ప్రభుత్వం కేటాయించిందన్నారు. కొడిమ్యాల మండలానికి 436మందికి కేటాయించగా మంజూరు పత్రాలను అందించామన్నారు. ఇళ్లు లేని పేదలను ఒక ఇంటి వారిని చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. మరో ఆరు నెలల తర్వాత రెండో విడత ఇందిరమ్మ ఇళ్ళ లబ్ధిదారుల జాబితాను ప్రభుత్వం తయారు చేస్తుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన రుణ మాఫీ కన్నా మూడు రెట్లు రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ ప్రసాద్, ఆర్డీవో మదుసూధన్‌గౌడ్, ఇందిరమ్మ ఇళ్ళ నియోజకవర్గ ఇన్‌చార్జి నక్క శ్రీనివాస్, ఎంపీడీవో స్వరూప, తహసీల్దార్ కిరణ్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నారాయణగౌడ్, సింగిల్ విండో చైర్మన్ రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రమేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహిపాల్‌రెడ్డి, ముత్యం శంకర్ గౌడ్, మల్లిఖార్జున్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, చంద్ర మోహన్‌రెడ్డి, స్వామి, మల్లేశం, నాగభూషణ్‌రెడ్డి, రవి, జితెందర్‌రెడ్డి, ప్రవీణ్, అయిలయ్య ఉన్నారు.

మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖలు చేసిన వారిపై చర్య తీసుకోవాలి



ఎస్ఐ రామచంద్రుడుకు ఫిర్యాదు చేస్తున్న ముస్లింలు

కోరుట్ల, మే 28 (ఆంధ్రజ్యోతి) : మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖలు చేసిన యూట్యూబ్ నిర్వాహకుడు చిలుక ప్రవీణ్ కుమార్‌పై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం కోరుట్ల మైనార్టీ సోదరులు జామితే ఐలే హదీస్ ముస్లిం సంఘ సభ్యులు కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశారు. కోరుట్ల రెండవ ఎస్ఐ రామచంద్రుడుకు ఫిర్యాదు అందజేసి కేసు రిజిస్టార్ చేయాలని జామితే ఐలే హదీస్ ముస్లిం సంఘ సభ్యులు కోరారు.

ఈ సందర్భంగా ముస్లిం సోదరులు మాట్లాడారు. చిలుక ప్రవీణ్ యూట్యూబ్ న్యూస్ అనే చానల్ నడుపుతూ మత విద్వేషాలకు రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. ఇస్లాం మహ్మద్ ప్రవర్తపై అనుచిత వ్యాఖ్యలు అతడు నడుపుతున్న యూ టూబ్ చానల్ ద్వారా ప్రచారం చేస్తూ మత విద్వేషాలకు దారి తీస్తున్నాడని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జామితే ఐలే హదీస్ నాయకులు పారుక్ అలీం, మిర్జా బాబా, షకీల్, ఇర్ఫాన్, బాషు బాయి, యూసుఫ్, మాజూర్ ఫసీయొద్దిన్, మహ్మద్ వకీల్, బారీలతో పాటు పలువురు ముస్లింలు పాల్గొన్నారు.

ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి రావాలని పూజలు

కథలాపూర్, మే 28 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి రావాలని కోరుతూ బుధవారం మండలంలోని భూషణ రావుపేట మర్రవ్వ దేవాలయంలో కాంగ్రెస్ నాయకులు పూజలు చేశారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సేవలో నిమగ్నమవుతున్న ఎమ్మెల్యేకు మంత్రి పదవి దక్కాలని వేడుకున్నారు. కొద్ది రోజుల్లో మంత్రివర్గ విస్తరణ చేపడుతున్న నేపథ్యంలో బీసీ కోటాలోని మున్నూరు కాపు సామాజిక వర్గం విభాగంలో మంత్రి పదవి దక్కేలా చూడాలని అమ్మవారిని కోరారు. ఈ సందర్భంగా మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంబటి రాధాకృష్ణ, తలారి మోహన్, వంగ మహేశ్, ఏఎంసీ డైరెక్టర్ రమేశ్, దాసరి అంజయ్య తదితరులు ఉన్నారు.

కోరుట్ల తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

కోరుట్ల రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల తహసిల్దార్‌గా కృష్ణ చైతన్య బుధవారం బాధ్యతను స్వీకరించారు. గత రెండు రోజుల క్రితం ధర్మపురి తహసిల్దార్‌గా పని చేసిన కృష్ణ చైతన్యను ఉన్నత అధికారులు కోరుట్ల తహసిల్దార్‌గా బదీలీ చేయ్యడంతో ఆయన బాధ్యతలను స్వీకరించారు. గతంలో తహసిల్దార్‌గా పని చేసిన కిషన్‌ను రెవెన్యూ ఉన్నత అధికారులు జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయ ఏఓగా బదీలి చేయ్యగా డిప్యూటీ తహసిల్దార్ ఫారూక్ ఇంచార్జ తహసీల్దార్‌గా వ్యవహరించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసిల్దార్ కృష్ణ చైతన్యను డిప్యూటీ తహసిల్దార్ ఫారూర్, ఆర్ఐలు రాజేందర్ రావు, అమర్ సమద్‌లతో పాటు సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. బాధ్యతలను స్వీరించిన తహసిల్దార్ ఆర్డీఓ జీవకర్ రెడ్డిని మర్యాద పూర్వగా కలిసారు

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

● జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్


రికార్డులను పరిశీలిస్తున్న డీఏవో భాస్కర్

కొడిమ్యాల, మే 28(ఆంధ్రజ్యోతి) : రైతులకు నకిలీ విత్తనాలను అమ్మితె సీడ్ ఆక్ట్ 1966 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి వి. భాస్కర్ హెచ్చరించారు. బుధవారం ఫెర్టీలైజర్ వెరిఫికేషన్‌లో బాగంగా కొడిమ్యాల, మండలంలోని తిప్పయ్యపల్లి, కోనాపూర్ గ్రామాల్లోని ఫెర్టిలైజర్ దుకాణాలను సందర్శించారు. ఈ సందర్భంగా దుకాణాలలోని విత్తనాల నిల్వ, ఎరువుల నిల్వలను, అనంతరం గోదాంలను పరిశీలించారు. వానాకాలం ప్రారంభమవుతున్నందున డీలర్లు స్టాక్‌ను అప్‌డేట్ చేయాలన్నారు.

స్టాక్ బోర్డు, ధరల పట్టికను ప్రదర్శించాలని వ్యవసాయ అధికారి ఆదేశించారు. దుకాణాల యజమానులు రైతులకు బిల్లును ఇవ్వాలని, రైతులు తాము కొనుగోలు చేసిన ప్రతి దానికి బిల్లును అడిగి తీసుకోవాలని ఆయన సూచించారు. సీజన్ పూర్తయ్యే వరకు తీసుకున్న బిల్లును భద్రపర్చుకోవాలన్నారు. ఈ సందర్శనలో డీఏవో వెంట ఏవో పి. జ్యోతి ఉన్నారు.

బల్దియాలో డీజిల్ గోల్‌మాల్

(5వ పేజీ తరువాయి)

లేదనే నెపంతో మాన్యువల్ బిల్లులు తీసుకొని రికార్డులు నమోదు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మాన్యువల్ బిల్లుల్లో వాహన నెంబర్లు లేకపోవడం మరింత అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయంపై వచ్చిన ఫిర్యాదుల మేరకు విచారణకు కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించిన నివేదిక బహిర్గతం చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

● ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేమి

జగిత్యాల మున్సిపాలిటీపై పర్యవేక్షణ లోపంతో అవినీతి పెరిగి పోయిందన్న విమర్శలున్నాయి. ఈ మధ్య కాలంలో ఏసీబీ, విజిలెన్స్ దాడులు జరుగుతున్నా ఉన్నతాధికారులు కనీసం కార్యాలయాన్ని సందర్శించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ శాఖ అధికా రులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించకపోవడం, ఆకస్మిక తనిఖీలు లేక పోవడంతో కార్యాలయంలో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి మున్సిపల్ ఆదాయానికి గండిపడకుండా చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

డీజిల్ అక్రమాలపై చర్యలు తీసుకుంటున్నాం

-స్పందన, మున్సిపల్ కమిషనర్, జగిత్యాల



మున్సిపాలిటీలో డీజిల్ అక్రమాల ఆరోపణలపై దృష్టి సారించాం. పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకు కారణమైన శానిటరీ ఇన్‌స్పెక్టర్ మారుతికి మెమో జారీ చేశాం. డీజిల్ వినియోగంపై బాధ్యతలను కొత్త అధికారులను అప్పగించాం. డీజిల్ బిల్లును తగ్గించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నా.

కేబుల్ ఆపరేటర్లు నిబంధనలు పాటించాలి


మాట్లాడుతున్న ఎస్ఈ సాలియా నాయక్

జగిత్యాల అగ్రికల్చర్, మే 28(ఆంధ్రజ్యోతి): కేబుల్ ఆపరేటర్లు నిబంధనలు పాటించాలని విద్యుత్ శాఖ ఎస్ఈ సాలియా నాయక్ సూచించారు. పట్టణంలో ఓవర్‌హెడ్ కేబుల్స్‌ను ఏరియల్ బంచ్డ్ కేబుళ్ల తరహాలో క్రమబద్ధంగా బంచ్ చేసి, క్లాంప్స్ ద్వారా అమర్చాలని అన్నారు. జగిత్యాల పట్టణంలో కేబుల్ ఆపరేటర్లు, ఇంటర్నెట్ సేవలందించే నిర్వాహకులతో ఆయన బుధవారం ఎస్ఈ కార్యాలయ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పోల్స్ అద్దె, ఓవర్‌హెడ్ కేబుళ్ల నిర్వహణ, క్రమబద్ధీకరణ అంశాలపై నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఎస్ఇ సాలియా నాయక్ చెప్పిన సూచనలపై కేబుల్ ఆపరేటర్లు, ఇంటర్నెట్ సేవల ఆపరేటర్లు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.ఈ సమావేశంలో జగిత్యాల టౌన్ సబ్ డివిజన్ ఏఈలు, ఏడీఈలు, డీఈ తో పాటు జగిత్యాల సబ్ డివిజన్ పరిధిలోని కేబుల్ ఆపరేటర్లు, ఇంటర్నెట్ సేవల ఆపరేటర్లు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణానికి నిధుల విడుదలపై హర్షం

మెట్‌పల్లి రూరల్, మే, 288 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండ్రికర్ల గ్రామ శివారులోని వాగుపై వంతెన నిర్మాణానికి ప్రభుత్వం 6.80కోట్లను మంజూరు చేసిందని హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గం ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమకుమార్‌రెడ్డి, సీతక్క చిత్రపటాలకు గ్రామస్థులు క్షీరాభిషేకం చేశారు. బుధవారం గ్రామ శివారులోని వాగు, తాత్కలికంగా ఏర్పాటు చేసుకున్న రోడ్డును స్థానిక నాయకులతో ఆయన కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి ఏఎంసీ వైస్ చైర్మన్ తిప్పిరెడ్డి అంజిరెడ్డి, అల్లూరి మహేంధర్‌రెడ్డి, కాటిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, పిడుగు తిరుపతిరెడ్డి, కొమ్ముల రాజేశ్వర్‌రెడ్డి, పల్లి శేఖర్‌గౌడ్, ఆకుల శ్రీనివాస్, గూడూరు తిరుపతి, కాశీం పాల్గొన్నారు.

ముమ్మరంగా ఉపాధిహామీ పనులు


మొగిలిపేటలో కొలతలను నమోదు చేసుకుంటున్న ఉపాధిహామీ సిబ్బంది

మల్లాపూర్, మే, 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. బుధవారం మండలంలోని మొగిలిపేట గ్రామ శివారులో ఫీడర్ ఛానల్ పనులు ఉపాధి హామీ సిబ్బంది కూలీలచే చేయించారు. గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న భూముల్లోకి నీరు అందించడానికి ఫీడర్ ఛానల్ పనులు చేపట్టినట్లు ఉపాధి హామీ అధికారులు తెలిపారు. గ్రామ శివారులోని కాలువ పూడికతీత పనులు 61 మంది కూలీలచే చేయించినట్లు వివరించారు. అనంతరం కూలీలు చేసిన పని వివరాలు, కొలతలను సిబ్బంది నమోదు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతో అధిక దిగుబడులు


మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త

మల్యాల, మే 28(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంను బుధవారం మండలంలోని రాంపూర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్తవేత్త డాక్టర్ రజనీకాంత్ నీటి యాజమాన్యం, పంటల మార్పిడితో కలిగే ప్రయోజనాలు, చెట్ల పెంపకంతో ఏర్పడే పర్యవరణ సమతుల్యతపై రైతులకు అవగాహన కల్పించారు. అధిక నత్రజని, రసాయన ఎరువుల వల్ల కలిగే దుష్ప్రభావాలు, పురుగుమందులు, రసాయన ఎరువులు తదితర వాటిపై మరో శాస్త్రవేత్త సాయినాథ్ వివరించారు. రైతులు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఫార్మర్ రిజిస్ట్రీలో తమ వివరాలు నమోదు చేసుకోవాలని తద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేసే వ్యవసాయ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామ పంచాయితీ ఆవరణలో ఉసరి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఏవో చంద్రదీపక్, ఏఈవోలు శ్రీనివాస్, లోహియ కంపెనీ ప్రతినిధి ఎస్. అనిల్‌కుమార్, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

మాజీ సీఎం ఎన్టీఆర్‌కు ఘన నివాళి


ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

జగిత్యాల అర్బన్, మే 28 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు జయంతి వేడుకలను టీడీపీ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కొండ శ్రీధర్, అక్కినపెల్లి కాశీనాథం, బత్తుల కొండయ్య, జున్ను మల్లయ్య, మంకిడి గంగాధర్, బొల్లం సతీష్, ఆవులరా మధు పాల్గొన్నారు.

●కోరుట్ల: పట్టణంలోని వివిధ వార్డులలో టీడీపీ శ్రేణులతో కలిసి టీడీపీ జెండాలను కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జ మానుక ప్రవీణ్ కుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

●మెట్‌పల్లిటౌన్: ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ మానుక ప్రవీణ్ కుమార్, కోరుట్ల, మల్లాపూర్, మెట్‌పల్లి టిడిపి నాయకులు గజ్జల్లి రాజా గణేష్, కటకం మహాదేవ్, మహమ్మద్ రఫీ ఉద్దీన్, బాలే మారుతి, ఎండి సాదుల్లా, కాకర్ల మాధవరెడ్డి, చిప్ప రాజశేఖర్, సాగర్,చందు తదితరులు పాల్గొన్నారు.

●రాయికల్: రాయికల్ పట్టణంలోని అంగడి బజార్‌లో ఎన్టీఆర్ 102వ జయంతి వేడుకలను ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మోర గణేష్, బొల్లారపు రాజేశం, నామని లక్ష్మీనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

●మల్లాపూర్: దేశంలో చరిత్ర సృష్టించిన తెలుగుదేశం వ్యవస్థాపకుడు, మాజీ సీఎం ఎన్టీఆర్‌కు భారతరత్నా ప్రభుత్వం ప్రకటించాలని టీడీపీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి మానుక ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఎన్టీఆర్ 102వ జయంతి సందర్భంగా మల్లాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి, రేగుంట ఆశ్రమంలో పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వరశరారెడ్డి, పిప్పెర శేఖర్, బాదె మారుతి, గణష్, తదితరులు పాల్గొన్నారు.

●ధర్మపురి: ధర్మపురి పట్టణంలో టీడీపీ ఆధ్వర్యంలో దివంగత ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం ఎన్టీఆర్ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిన నంది చౌక్ వద్ద టీడీపీ మండల అధ్యక్షులు ఉప్పుల రామకిష్టయ్య ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూల మాల వేసి టెంకాయ కొట్టి జెండా ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ఉపాధ్యక్షులు వెన్నం గంగారెడ్డి, కార్యనిర్వాహణ కార్యదర్శి అయ్యోరు శంకరయ్య, పట్టణ అధ్యక్షులు తిరుమన్‌దాసు శ్రీనివాస్ పాల్గొన్నారు.

'అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?'

మెట్‌పల్లిటౌన్/ఇబ్రహీంపట్నం, మే 27(ఆంధ్రజ్యోతి): అభివృద్ధిపై ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ చర్చకు సిద్ధమా అని బీజేవైఎం నాయకులు దొనికెల నవీన్, ఎస్సీ జిల్లా మోర్చా ప్రధాన కార్యదర్శి బత్తుల శ్రీనివాస్, ఇబ్రహీంపట్నం మండల ప్రధాన కార్యదర్శి సుంచు రణధీర్‌లు వేర్వేరుగా ప్రశ్నించారు. బుధవారం పట్టణంలో, ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ పార్లమెంట్ పరిధిలో అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తుంటే ఎమ్మెల్యే జీర్ణించుకోలేక మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇచ్చిన మాట ప్రకారం రైతులకు పసుపు బోర్డు తీసుకువచ్చిన ఘనత బీజేపీ ప్రభుత్వందే అన్నారు. దేశమంతా పోటీ పడ్డా, ఇందూరులోనే పసుపు బోర్డు కేంద్ర కార్యాలయంను ఏర్పాటు చేశామన్నారు. వచ్చే ఎన్నికలలో ఇబ్రహీంపట్నం మండల ఎంపీపీ, జడ్పీటీసీ, సర్పంచ్ స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంటుందన్నారు. బీజేపీ నాయకులు పతంగి వెంకటేష్, సురేష్, మారుతి, మణిరాజ్ పాల్గొన్నారు.

ఉత్సవాలలో పాల్గొన్న సిబ్బందికి సన్మానం

మల్యాల, మే28 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో ఇటీవల జరిగిన పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాల విజయవంతంలో పాలుపంచుకున్న సిబ్బందికి దేవస్థానం ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. ఆలయ ఉద్యోగులు, అర్చకులు, పోలీస్, హోంగార్డు, సెక్యూరిటీ సిబ్బంది తదితరులను శాలువతో సత్కరించారు. ఈవో శ్రీకాంత్‌రావు మెమొంటోలు అందించి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు సునీల్, చంద్రశేఖర్, హరిహరనాథ్ పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల సమావేశం

ధర్మపురి, మే 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయంలో డిష్ కేబుల్ ఇంటర్‌నెట్ కేబుల్ ఆపరేటర్లతో విద్యుత్ శాఖ అధికారులు బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ధర్మపురి, బుగ్గారం, వెలగటూర్, ఎండపల్లి మండలాల ఆపరేటర్లు హాజరు అయ్యారు. ఈ సందర్భంగా డీఈ రాజిరెడ్డి మాట్లాడుతూ గతంలో సర్వే ప్రకారం కేబుల్ కనెక్షన్స్ ఎలక్ట్రికల్ పోల్‌పై ఉన్నందులకు వాటికి నెలసరి ఛార్జీలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ధర్మపురి ఏడీఈ సిందూర్‌శర్మ, ధర్మపురి, నేరెళ్ల, వెలగటూర్, రాజారాపల్లె ఏఈలు రవి, రాజశేఖర్, శ్రీనివాస్, సమ్మయ్య సిబ్బంది పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల అర్బన్, మే 28 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో విస్తృత ప్రచారం నిర్వహించడం వల్ల ప్రజలు క్యాన్సర్ బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. బుధవారం జగిత్యాల పట్టణంలోని ఓల్డ్ హైస్కూల్ లో జగిత్యాల ఐఎంఏ మరియు కిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల రోజు వారీ జీవన విధానం, వ్యాయమం, నడక ద్వారా ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వారు క్యాన్సర్ నివారణర చర్యలపై అవగాహన కల్పించేందుకు కరపత్రాలను ఉపయోగించు కోవాలని సూచించారు. మూఢ నమ్మకాలు వద్దని సైన్స్‌ను నమ్మి ముందస్తు చికిత్స చేయించుకోవాలని ప్రజలకు సూచించారు. ప్లాస్టిక్ వాడకం పూర్తిగా తగ్గించాలని, రోగం వచ్చాక చికిత్స తీసుకునే కంటే రోగం రాకుండా చూసుకోవడం ముఖ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి, ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ గూడూరి హేమంత్, డాక్టర్ ఆకుతోట శ్రీనివాస రెడ్డి, డాక్టర్ సుదీర్, మాజీ కౌన్సిలర్ చుక్క నవీన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ కిమ్స్ ఆసుపత్రి నుంచి వచ్చిన 40 మంది వైద్యులు, సిబ్బంది పరీక్షలు నిర్వహించారు. బుధవారం మొత్తం ఐదు వందల మందిని పరీక్షించినట్లు కిమ్స్ ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. వీరందరి టెస్టుకు సంభందించిన పలితాలు త్వరలో పంపిస్తామని కిమ్స్ వైద్య బృందం సభ్యులు తెలిపారు.

●జగిత్యాల అర్బన్, మే 28 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అధికారులు, నాయకులతో పాటు ప్రజలు కూడా బాధ్యతతో మెలగాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కూమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని 25, 26వ వార్డులలో 40 లక్షల నిధులతో సిసి రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభివృద్ధి చెందాలంటే ప్రజల భాగస్వామ్యం ఉండాలన్నారు. రెవంత్ రెడ్డి చొరవతో డబుల్ బెడ్ రూం ఇళ్ళలో మౌళిక వసతులు కల్పించడానికి నిధులు మంజూరు అయ్యాయన్నారు. పట్టణంలో అండర్ గ్రౌండ్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. పట్టనంలో 14 జోన్‌లు, 126 సర్వే నంబర్‌లకు చట్టబద్దంగా అనుమతులు వస్తున్నాయన్నారు. లే అవుట్ ప్రకారం నిర్మాణాలు చేపట్టేలా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. గోళి శ్రీనివాస్, చిక్కుల భూమయ్య, డిఈ నాగేశ్వర్, పబ్లిక్ హెల్త్ డిఈ వరుణ్, ఏఈ శరణ్ తదితరులు పాల్గొన్నారు.